
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం ׀ 15 ׀ నవంబర్ ׀ 2024



సోమశిలలో 69.14 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 69.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 7,188 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టా, కండలేరు, ఉత్తర, దక్షిణకాలువలకు 3600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.77,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ6,908
3 శాతం జీఎస్టీతో	రూ.7,115
నవర (8 గ్రా)	రూ.56,920

గరిష్ఠం/కనిష్ఠం
29.1 /25.0

వాతావరణం

జిల్లాలో శుక్రవారం అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 98 శాతంగా గురువారం నమోదైంది.

ఏయ్.. మమ్మల్నే ప్రశ్నిస్తారా..?

'సామాజిక' గొంతుకలకు సంకెళ్లు

- భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై ఉక్కుపాదం
- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియానే లక్ష్యంగా వేధింపులు
- జిల్లాలో 21 మందిపై కేసులు నమోదు

భారత రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించడమే లక్ష్యంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలు.. సూపర్ సిక్స్ హామీల అమల్లో అసమర్థత.. అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎవరైనా ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా తమ అభిప్రాయాలను ఎవరైనా వ్యక్తపరిస్తే.. మాకే ఎదురొస్తావానంటూ ఉరుకుతోంది. ఇలా ప్రశ్నించే గొంతుకలకు సంకెళ్లు వేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. హామీలను అమలు చేయాలంటూ సోషల్ మీడియాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యాక్టివిస్టులు పోస్టులు పెట్టడమే తప్పనే రీతిలో చెలరేగిపోతూ అక్రమ కేసులు బనాయిస్తోంది.



నెల్లూరు (క్రైమ్): అభివృద్ధి.. సంక్షేమాన్ని కాంక్షించే తమను ప్రజలు గెలిపించారనే అంశాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడకుండా కాలయాపన చేస్తోంది. ఈ పరిణామాల క్రమంలో తమపై వస్తున్న వ్యతిరేకతను ఎలాగైనా దారి తప్పించాలనే ఉద్దేశంతో వికృత క్రీడకు తెరలేపింది. తమ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతోంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా శిక్షార్హులేననే విషయాన్ని విస్మరిస్తోంది. ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను ప్రశ్నించడమే తప్పనే రీతిలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మూడు కేసులను నమోదు చేశారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గ చర్యలకు ఇది పరాకాష్ఠగా నిలుస్తోంది.

అవన్నీ.. మాకు కనిపించవు..!

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకే కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు చెప్తున్నారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, మాజీ మంత్రులపై విషం చిమ్మడమే లక్ష్యంగా కూటమి పార్టీల నేతలు, ఆ పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో దారుణంగా పోస్టులు పెడుతున్నారు. అయితే ఇవేవీ పోలీసులకు కనిపించకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఖాకీలు ఎంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే అంశం దీని ద్వారా తేటతెల్లమవుతోంది.

జిల్లాలో 21 కేసులు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, లోకేశ్ తదితరులపై వ్యతిరేక పోస్టులు పెట్టారంటూ 21 మందిపై జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి పాలకుల లోపాలను రాజకీయ పార్టీలతో పాటు సామాజిక స్పృహ కలిగిన అనేక మంది తమకు తోచిన రీతిలో ఎత్తి చూపడం సహజం. ఇలాంటి విమర్శ జనహితమే అయినప్పుడు అందులోని మంచిని తీసుకొని లోపాలను పాలకులు సవరించుకునేవారు. అయితే నేడు ఆ పరిస్థితే కనుమరుగైంది. తమనే తప్పుపడతారాననే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కర్కశంగా వ్యవహరిస్తోంది. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై టీడీపీ, జనసేన నేతలతో ఫిర్యాదులు చేయించి.. పోలీసుల ద్వారా ఎక్కడెక్కడి వారినో ఇక్కడికి తీసుకొచ్చి కేసుల పేరిట వేధిస్తోంది. వీటి వివరాలను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. పాత కేసులనూ తిరగదోడుతున్నారు.

ప్రశ్నించడమేనా కాకాణి నేరం..?

మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సైతం పోలీసుల వేధింపులు తప్పలేదు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సెప్టెంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. దీనిపై 'సాక్షి'లో ప్రచురితమైన వార్తను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారంటూ వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత నెల్లూరులో ప్రెస్‌మీట్ పెడితే.. ఆ వీడియోను ఫార్వార్డ్ చేశారని మరో కేసు పెట్టారు. స్థానిక ఎమ్మెల్యేపై అసభ్యకరంగా పోస్టు పెట్టారంటూ ముత్తుకూరు పోలీస్‌స్టేషన్లో మరో కేసు నమోదైంది.

ఇతర జిల్లాల వారిపై దాష్టీకం

➡ సీఎం చంద్రబాబుపై అనుచిత పోస్టులు పెట్టారంటూ నెల్లూరులోని 35వ డివిజన్ జనసేన నేత అశోక్ ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ మేకా వెంకట రామిరెడ్డిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

➡ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకర మెసేజ్‌లతో పోస్టులు పెడుతున్నారని ఆరోపిస్తూ నెల్లూరులోని 32వ డివిజన్ టీడీపీ నేత ముఫీద్ ఫిర్యాదు మేరకు సత్యసాయి జిల్లా రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బాలాజీరెడ్డిపై వేదాయపాళెం పోలీసులు ఈ నెల 12న కేసు నమోదు చేశారు.

➡ సామాజిక మాధ్యమాల్లో సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ చిత్రాలను మార్ఫింగ్ చేశారని ఆరోపిస్తూ సంగం మండలం తలుపూరుపాడుకు చెందిన టీడీపీ నేత బాబు ఫిర్యాదు మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన హనుమంతరెడ్డిపై పోలీసులు ఈ నెల 12న కేసు నమోదు చేశారు.

➡ పల్నాడు, అనంతపురం జిల్లాలకు చెందిన ఇద్దరిపై.. కందుకూరుకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త పఠాన్ ఆయూబ్‌ఖాన్‌పై కందుకూరు సర్కిల్ పరిధిలో కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త అన్నంగి నరసింహ స్వామిపై కందుకూరు స్టేషన్లో కేసు నమోదైంది.

➡ అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం ముదిగుబ్బకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త జనికుల రామాంజనేయులుపై కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు.

పోసానిపై కేసు

కావలి: సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై కావలి డీఎస్పీకి టీడీపీ నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. మరో 15 మందితో జాబితాను తయారు చేస్తున్నామంటూ బహిరంగంగా ప్రకటించారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే కీసర రాజశేఖర్‌రెడ్డిపై తుఫాన్‌నగర్‌కు చెందిన ఏగూరు చంద్రశేఖర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు.

వేధింపులకు పరాకాష్ట

➡ విజయవాడలో వరదలొచ్చిన సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా సీఎస్ పురానికి చెందిన హరీశ్వర్‌రెడ్డిపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి విచారణ పేరిట వేధించి నోటీసులిచ్చి పంపారు.

➡ తిరుపతి లడ్డూ విషయంలో చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టిన ఉదయగిరి మండలం బండగానిపల్లికి చెందిన బేరి తిరుపతిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

➡ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారంటూ కావలిలోని 11వ వార్డుకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టులు ఆత్మకూరు రాజేష్, దామర్ల శ్రావణ్‌కుమార్‌పై అక్కడి ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

➡ దగదర్తిలో టీడీపీ నేత తన స్నేహితులతో కలిసి మందు పార్టీ చేసుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. వీటిని తన వాట్సాప్ గ్రూప్‌లో ఫార్వార్డ్ చేశారంటూ ప్రభావతిపై కేసు నమోదు చేశారు.

➡ ప్రభుత్వ వైఫల్యాలపై మీడియాలో వచ్చిన కథనాలు, పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ఫార్వార్డ్ చేశారని బోగోలుకు చెందిన వీరరఘు, కుందుర్తి శ్రీనివాసులు, మేకా శ్రీనివాసులు, ఎస్వీవీ కండ్రికకు చెందిన ఉప్పాల మాచర్ల, విశ్వనాథరావుపేటకు చెందిన సుందరరాజుపై కేసులు నమోదయ్యాయి.

➡ సీఎం, డిప్యూటీ సీఎంపై తప్పుడు ఫిర్యాదులు పెట్టారంటూ కావలికి చెందిన వెంకటరామిరెడ్డిపై అక్కడి ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధిస్తే సహించేదిలేదు



రాజేష్‌ను పరామర్శిస్తున్న కాకాణి, రామిరెడ్డి

కావలి: సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న యాక్టివిస్టులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధిస్తే సహించేది లేదని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ పట్టణంలోని 11వ వార్డుకు చెందిన పార్టీ ఇన్‌చార్జి, సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఆత్మకూరు రాజేష్‌పై కేసులతో పోలీసులు వేధిస్తుండటంతో కాకాణి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

న్యూస్‌రీల్

టాస్క్‌ఫోర్స్ కమిటీలో ఇద్దరికి చోటు



చంద్రశేఖర్‌రెడ్డి



ప్రతాప్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు అండగా నిలిచేందుకు గానూ రాష్ట్ర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ కమిటీలను పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీకి ఇద్దర్ని ఎంపిక చేశారు. వీరిలో ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

నెల్లూరు రూరల్: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని నెల్లూరు ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ.. ఉపసంహరణ.. పోటీలో నిలిచిన అభ్యర్థులు.. తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ మల్లికార్జున అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. అన్ని మండల కేంద్రాల్లో పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించనున్నామని తెలిపారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా నాగరాజమన్నార్



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా వీరవెంకటనాగరాజమన్నార్ బాధ్యతలను గురువారం స్వీకరించారు. మార్కాపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల్లూరు మెడికల్ కళాశాలను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేలా చూస్తానని తెలిపారు. కాగా ఇప్పటి వరకు ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తించిన గోవిందు తన బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ప్రిన్సిపల్‌కు పలువురు వైద్యులు అభినందనలను తెలియజేశారు.

ఐటీఐలో జాబ్ మేళా నేడు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డైకిన్, హీరో మోటార్ కార్ప్ లిమిటెడ్, క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్, భార్గవి ఆటోమొబైల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. జిల్లాలో పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన వారు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు నిర్వహించనున్న జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 94944 56326, 63015 29271 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో వర్షాలు

- సరాసరి వర్షపాతం 25.7 మిల్లీమీటర్లు

నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా దగదర్తి మండలంలో 75.4.. అత్యల్పంగా రాపూరులో 2.2 మిల్లీమీటర్ల వర్షం గురువారం పడింది. జిల్లా సరాసరి వర్షపాతం 25.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. కావలిలో 65.4, సంగంలో 57.8, ఆత్మకూరులో 51.2, కందుకూరులో 48.4, కలువాయిలో 47.2, జలదంకిలో 44.2, ఉలవపాడులో 44, అల్లూరు, అనంతసాగరంలో 41, బోగోలులో 35.4, గుడ్లూరులో 32.2, ఉదయగిరిలో 28.4, తోటపల్లిగూడూరులో 27.4, కోవూరులో 27.2, అనుమసముద్రంపేటలో 24 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సీతారామపురంలో 22.8, దుత్తలూరులో 22.8, వలేటివారిపాళెంలో 21.8, కలిగిరిలో 21.8, చేజర్లలో 20.4, వింజమూరులో 20.2, కొండాపురంలో 17, సైదాపురంలో 16.6, మర్రిపాడులో 16.2, బుచ్చిరెడ్డిపాళెంలో 15, వెంకటాచలంలో 14.8, ముత్తుకూరులో 14.2, లింగసముద్రంలో 12.4, మనుబోలులో 9.2, నెల్లూరు అర్బన్‌లో 7.8, ఇందుకూరుపేటలో 7.2, నెల్లూరు రూరల్‌లో 6.4, విడవలూరులో 6, పొదలకూరులో 4.6, వరికుంటపాడులో 4.2, కొడవలూరులో నాలుగు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- 'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం
- జనహిత, వాత్సల్యలో పండగ వాతావరణం



కేక్‌ను కట్ చేస్తున్న సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డి, చిత్రంలో ఎంఈఓ మురళీధర్‌రావు తదితరులు



బహుమతులను అందుకుంటూ..

నెల్లూరు(బృందావనం): ప్రతిభా పాటవాల ప్రదర్శన.. సాంస్కృతిక కార్యక్రమాలు.. అందుకున్న ప్రోత్సాహక బహుమతులు.. విద్యార్థుల కేరింతలతో వనంతోపు సెంటర్‌లోని జనహిత, వాత్సల్య నిరాధార బాలబాలికల ఆశ్రమంలో సందడి వాతావరణం నెలకొంది. జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని సాక్షి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవం దీనికి వేదికైంది. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నెల్లూరు రూరల్ ఎంఈఓ మురళీధర్‌రావు మాట్లాడారు. ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా ఎదగనున్న దేశ భవిష్యత్తుకు నేటి బాలలే పునాదులని చెప్పారు. బాలల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పత్రికలు పోషిస్తున్న పాత్ర ఎనలేనిదని కొనియాడారు. జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు గానూ విద్యార్థులు పుస్తకాలతో పాటు పత్రికల పఠనాన్నీ అలవర్చుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంక్షించారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జనహిత, వాత్సల్య ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావు మాట్లాడారు. బాలల్లో ఉల్లాసాన్ని కల్పించి.. వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ.. సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు సాక్షి యాజమాన్యం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అభినందించారు. దేశం కోసం మహనీయులు చేసిన త్యాగాలను మననం చేసుకొని ముందుకుసాగాలని కాంక్షించారు.

అలరించిన ఆటపాటలు

సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు డిక్షనరీలు, జామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు, విద్యా సామగ్రిని అందజేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ చిన్నారులు ప్రదర్శించిన జానపద, సాంస్కృతిక కోలాటాలు, నృత్యాలు అలరించాయి. చిన్నారుల భగవద్గీత శ్లోకాలు ఆధ్యాత్మిక చింతనను కలిగించాయి. సాక్షి నెల్లూరు యూనిట్ మేనేజర్ బీ శ్రీనివాసరావు, సాక్షి నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జి మస్తాన్‌రెడ్డి, జనహిత, వాత్సల్య, భారతీయ విద్యా వికాస్ సంస్థలకు చేందిన శ్రీదేవి, శేషమ్మ, ఇందిరమ్మ, రాధమ్మ, మాధవి, శిరీష, డ్యాన్స్ మాస్టర్ నరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన చిన్నారులు





విద్యార్థుల నృత్య ప్రదర్శన

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలాజీరావు

నెల్లూరు రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభించారు. రేబాలవారివీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డీఈఓ బాలాజీరావు మాట్లాడారు. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో పుస్తక విలువను విద్యార్థులు తెలుసుకోవాలని కోరారు. పుస్తక పఠనానికి రోజూ కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. అనంతరం ఆర్ అండ్ బీ ఎస్ఈ గంగాధర్ మాట్లాడారు. కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునికీకరించి, నూతన భవనాన్ని పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. తొలుత బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నారుల నత్య ప్రదర్శనలు అలరించాయి. మహాత్మాగాంధీ సత్యశోధన, ఆత్మకథ పుస్తకాలను చిన్నారులు, అతిథులకు అందజేశారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి సదారావు, కవి పెరుగు రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా, సివిల్ ఇంజినీర్ రామకృష్ణ, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రీచ్‌లకు టెండర్ల ఖరారు



నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రెండు ఇసుక రీచ్‌లకు సంబంధించిన టెండర్లను కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో గురువారం ఖరారు చేశారు. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం రీచ్‌కు ఆరు టెండర్లు దాఖలుకాగా, వివిధ కారణాలతో రెండింటిని తిరస్కరించారు. మిలీనియం స్టీల్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. పల్లిపాడుకు సంబంధించి ఎనిమిది టెండర్లు రాగా, వివిధ కారణాలతో మూడింటిని తిరస్కరించారు. ఈ రీచ్‌ను భరణికుమార్ దక్కించుకున్నారు. పూర్తి స్థాయిలో అనుమతులొచ్చాక జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని జేసీ తెలిపారు.

సత్వరమే భూసేకరణ ప్రక్రియ



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులతో కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే, ఆర్ఓబీలు, ఆర్ అండ్ బీ రోడ్లు, ఏపీఐఐసీ మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు భూమిని సేకరించాలని సూచించారు. నిబంధనల మేరకు చెల్లింపులు జరపాలని కోరారు. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను పూర్తి చేయాలన్నారు. జేసీ కార్తీక్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ఆర్డీఓలు అనూష, పావని, వంశీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ ఎస్ఈలు దేశనాయక్, గంగాధర్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమ్మేసిన కారుమబ్బులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నెల్లూరులో ఆకాశం గురువారం మేఘావృతమైంది. సాయంసంధ్య వేళ కారుమబ్బులు కమ్మేయడంతో ఆహ్లాద వాతావరణం నెలకొంది. పడుగుపాడు వద్ద ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

కేన్సర్ స్క్రీనింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



వరిగొండ పీహెచ్‌సీలో పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ స్క్రీనింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. 'కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం' కార్యక్రమంలో భాగంగా గురువారం వరిగొండ పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ అందరికీ కేన్సర్ పరీక్షలను చేస్తామన్నారు. వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి ఇంటికీ వెళ్లి స్క్రీనింగ్ చేపట్టాలన్నారు. ఎవరికైనా కేన్సర్ లక్షణాలున్నట్లు అనుమానం వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేంద్ర, సీహెచ్‌ఓ రమేష్, హెల్త్ హెడ్యూకేటర్ ఉమర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

19న బహిరంగ వేలం

నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వ మద్యం దుకాణాల రద్దుతో అందులోని సామగ్రిని ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకుని నెల్లూరు వేదాయపాళెం గాంధీనగర్ రోడ్డులోని ఏపీ స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ గోదాములో భద్రపరిచారు. అందులో ఉన్న 171 ఫ్రీజర్లు, 160 ఇన్వర్టర్లు విత్ బ్యాటరీలు, 165 క్యాష్ చెస్ట్‌లు, 324 స్కానర్లు, 165 నగదు కౌంటింగ్ మెషీన్లను ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు గోదాము వద్దనే బహిరంగ వేలం వేయనున్నట్లు ఏపీఎస్‌బీసీఎల్ నెల్లూరు డిపో మేనేజర్ ఎస్.ఆయేషాబేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు స్టోర్ ఆఫీసర్ 90000 15109, అసిస్టెంట్ మేనేజర్ 98486 27590, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ 99493 51043, ఈఎస్ 98850 34694 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	102
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	190
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	214
లేయర్ చికెన్ :	187

ఖాకీ జులుం

- కందుకూరు డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్లపై విమర్శల వెల్లువ
- అధికార పార్టీకి దాసోహం
- సివిల్ పంచాయితీలకు వేదిక
- సెటిల్‌మెంట్లు చేస్తున్న పోలీస్ అధికారులు
- వేధింపులతో భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్యాయత్నం



కందుకూరు: కొంతకాలంగా కందుకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లు నిత్యం వార్తల్లో ఉంటున్నాయి. బాధితులకు న్యాయం చేయకుండా అక్రమార్జనపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని ఖాకీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ పంచాయితీలకు స్టేషన్లను వేదికగా మార్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు తగినట్టుగానే కొన్ని సంఘటనలు జరిగాయి.

నగదు వసూలు

ఇటీవల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటన పోలీసుల ధనదాహానికి అద్దం పడుతోంది. పట్టణంలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివే ఓ విద్యార్థి, తన తోటి విద్యార్థినితో స్నేహంగా ఉంటున్నాడు. ఇటీవల వారు ముత్యాలగుంట పార్కు వద్ద నుంచి నడుచుకుంటూ జీ+3 ఇళ్ల వద్దకు వెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన పోలీసులు ఆ జంటను స్టేషన్‌కు తీసుకొచ్చి అర్ధరాత్రి వరకు ఉంచారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించి బాలుడిని వదల్లేదు. యువకుడి తల్లి స్టేషన్‌కు వచ్చి బతిమాలుకోవడంతో కానిస్టేబుల్ రూ. 15 వేలు ఫోన్‌పే చేయించుకున్నాక వదిలిపెట్టారు. ఆ బాలుడికి తండ్రి లేడు. తల్లి బేల్దారి పనులకు వెళ్తేనే పూటగడిచే పరిస్థితి.

ఆడుకో రాజా మీ ఇష్టం

గుడ్లూరు స్టేషన్ పరిధిలో అయితే గుడ్లూరుకి చెందిన అధికార పార్టీ నేత పెద్దఎత్తున పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నాడు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పేకాటరాయళ్లు వస్తుంటారు. రోజూ రూ.లక్షలు చేతులు మారుతుంటాయి. ఇదంతా పోలీసులకు తెలిసినా తమకు తెలియదన్నట్లు వ్యవహరిస్తారు. సదరు నాయకుడు పదిరోజులకు రూ.లక్ష ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారనే ప్రచారం ఉంది. కందుకూరులో పేకాట శిబిరాలు నిర్వహించుకునేందుకు సింగరాయకొండకు చెందిన ఓ వ్యక్తి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

వారినీ వదలడం లేదు

రోడ్డు ప్రమాదాల కేసులను సెటిల్‌మెంట్ పద్ధతిలో పోలీసులు సీరుగారుస్తున్నారు. ఇటీవల వలేటివారిపాలెం, గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కొన్ని ఘటనలు చోటు చేసుకున్నాయి. గుడ్లూరు స్టేషన్ పరిధిలోని దారకంపాడుకు చెందిన ఓ యువకుడిని కారు ఢీకొనడంతో కాలు విరిగింది. ఆ కేసును రాజీ చేసుకోవాలని తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చారు. లేదంటే మీపై కూడా కేసు పెడతామని బెదిరించారు. అయితే క్షతగాత్రుడు పట్టుబట్టడంతో చివరకు ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తీసుకురాకుండా బాధితుడి ద్విచక్ర వాహనం తీసుకెళ్లడం విశేషం.

సివిల్ పంచాయితీలకు..



గోవర్ధన్

కందుకూరు పట్టణ పోలీస్‌స్టేషన్ సివిల్ పంచాయితీలకు వేదికైనట్లు విమర్శలున్నాయి. పట్టణానికి చెందిన తలతోటి మస్తాన్ అనే ఓ భవన నిర్మాణ కాంట్రాక్టర్ వద్ద జొన్నల గడ్డ గోవర్ధన్ పనిచేస్తున్నాడు. ఇతను ఇటీవల మస్తాన్ వద్దకు పనికి వెళ్లడం మానుకున్నాడు. గోవర్ధన్ డబ్బులివ్వాలని, ఆ మొత్తాన్ని ఇప్పించాలని మస్తాన్ కందుకూరు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఆగమేఘాలపై గోవర్ధన్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు అర్ధరాత్రి వరకు ఉంచి వేధింపులకు పాల్పడ్డారు. అతడిని బెదిరించి రూ.5 లక్షలు మస్తాన్‌కు అప్పు ఉన్నట్లుగా కాగితాలపై సంతకాలు చేయించారు. ఈ వ్యవహారంలో పట్టణ ఎస్సై, సీఐలు భాగస్వాములైనట్లు ఆరోపణలున్నాయి. అంతటితో ఆగకుండా మస్తాన్ తన మనుషులతో చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో గోవర్ధన్ వాళ్ల చేతుల్లో చావడం కంటే తాను చావడమే మేలని సెల్ఫీ వీడియో పెట్టి మరీ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. వీడియో వైరల్ కావడంతో జిల్లా పోలీస్ అధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుడు చెప్పాడనే కారణం, డబ్బుకు ఆశ పడి వేధింపులకు పాల్పడ్డారనే విమర్శలను పోలీసులు మూటగట్టుకున్నారు. దళిత సంఘాలు గోవర్ధన్‌కు మద్దతుగా నిలిచి పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని దుయ్యబడుతున్నాయి.

రేషన్ డీలర్లకు బెదిరింపులు

అధికారంలో వచ్చిన వెంటనే రేషన్ షాపులను అధికార పార్టీ నాయకులు స్వాధీనం చేసుకున్నారు. ఇక నియోజకవర్గంలో ఐదారు వరకు పర్మినెంట్ షాపులున్నాయి. వాటి డీలర్లు రాజీనామా చేయలేదు. దీంతో వారిచేత రాజీనామా చేయించే బాధ్యతను అధికార పార్టీ నేత ఒకరు పోలీసులకు అప్పగించారు. సదరు డీలర్లను స్టేషన్‌కు పిలిపించి బెదిరింపులకు దిగుతున్నారు. అసలు పోలీసులకు ఏ మాత్రం సంబంధం లేని ఈ విషయంలో తలదూర్చి అధికార పార్టీ నేతల మెప్పు కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఇక వలేటివారిపాలెంలో దేవాదాయ శాఖ భూముల వేలం వ్యవహారంలో పాటపాడేందుకు ధరావత్తు కట్టిన పలువురిని పోలీసులు వేధింపులకు గురి చేశారు.

పరీక్షలకు 130 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 137 మందికి గానూ 130 మంది హాజరయ్యారని తెలియజేశారు.

గంగిరెడ్డిపల్లిలో నేలకొరిగిన వరి



నేలవాలిన వరి

ఉదయగిరి: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు, రబీ సీజన్‌లో ముందుగా వేసిన పంటలు వానల కారణంగా దెబ్బతింటున్నాయి. ఉదయగిరి సబ్ డివిజన్‌లోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోత దశకు వచ్చింది. మరో వారంరోజుల్లో పంట కోత కోసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. వర్షాలు ఇలాగే కొనసాగితే నేలవాలిన వరి గింజ మొలకెత్తి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లిలో సుమారు 120 ఎకరాల్లో జిలకర మసూరా సాగు చేశారు. వారం రోజుల్లో పంట ఇంటికి చేరుతుందనగా వర్షం వారిని దెబ్బతీసింది. సుమారు 40 ఎకరాల్లో పంట నేలకొరగడంతో అన్నదాతలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకున్నామని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. మొదట సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీసీఓ మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాలది కీలకపాత్ర అన్నారు. ప్రతి ఏడాది నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సంఘాలను బలోపేతం చేయడం, కామన్ సర్వీసుల ద్వారా ఆన్‌లైన్ సేవలు అందించడం, నాణ్యమైన స్వదేశీ విత్తనాలను రైతులకు సరఫరా చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ సహకార యూనియన్ జిల్లా ఏడీ డా.మాధవిలత, బ్యాంక్ ఓఎస్‌డీ అంజిరెడ్డి, జనరల్ మేనేజర్ సరిత, సహకార శిక్షణా కేంద్రం ప్రొద్దుటూరు రిజిస్ట్రార్ సాయినాథ్, డీజీఎంలు రమేష్, మధుసూదన్‌రావు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడుచుకుంటూ వెళ్తుండగా..

• ఆటో ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతదేహం

కందుకూరు: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన గురువారం కందుకూరులో చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గుండంకట్ట ప్రాంతానికి చెందిన ఆంజనేయులు (30) ఇటీవల స్వామి మాల వేసుకున్నాడు. కోవూరు రోడ్డు సాయిబాబా మందిరం ప్రాంతంలో రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. పూజా కార్యక్రమాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున నిద్ర లేచి కోవూరు రోడ్డులోని గాయత్రి ఒలింపియాడ్ స్కూల్ సమీపంలో నడుస్తూ వెళ్తుండగా వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. తలకు గాయాలై ఆంజనేయులు మృతిచెందాడు. డ్రైవర్ ఆటోను ఆపకుండా పారిపోయాడు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై సాంబశివయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలకు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

- కేసు పెడితే చంపేస్తామని బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- రౌడీషీటర్, ఆరుగురు యువకుల అరెస్ట్

నెల్లూరు సిటీ: ఓ బార్‌లో రౌడీషీటర్, మరో ఆరుగురు యువకులు కలిసి పూటుగా మద్యం తాగారు. బయటికొచ్చి ఆటో డ్రైవర్‌ను తమ ప్రాంతంలో వదలాలని చెప్పగా అతను నిరాకరించాడు. దీంతో వారందరూ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు. నగరంలోని జల్సా బార్‌లో దళితవాడకు చెందిన రౌడీషీటర్ చంద్ర, మరో ఆరుగురు యువకులు బుధవారం రాత్రి మద్యం తాగారు. అనంతరం ఇంటికెళ్లేందుకు వారు బయటకు వచ్చారు. నవాబుపేటలోని తడికలబజార్ సెంటర్‌కు చెందిన మణికంఠ అల్లీపురం సమీపంలోని ఓ రైస్‌మిల్లులో బియ్యం బస్తాలను దించి ఇంటికి బయలుదేరాడు. సదరు యువకులు ఆటోను ఆపారు. తమను దళితవాడ వద్ద దించాలని చెప్పారు. కుదరదని మణికంఠ వారికి చెప్పాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న యువకులు మణికంఠపై ఒక్కసారిగా తీవ్రంగా దాడికి దిగారు. ఏడుగురూ అతడిని తీసుకుని ఆటోలోనే తమ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ దిగాక తమపై కేసు పడితే నీ అంతు చూస్తామని, చంపేస్తామని మణికంఠను బెదిరించి వెళ్లిపోయారు. బాధితుడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. సీఐ వేణు పర్యవేక్షణలో సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపి..

• బైక్‌ను ఢీకొట్టడంతో రూ.11 వేల జరిమానా

ఉదయగిరి: మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తికి రూ.11 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. షేక్ జమీర్‌బాషా అనే వ్యక్తి బుధవారం రాత్రి మద్యం తాగి తన అంబులెన్స్‌తో పట్టణంలో మోటర్‌బైక్‌ను ఢీకొట్టాడు. అతను పలువురు వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో పోలీసులు అంబులెన్స్‌ను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశామన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి భారతి జమీర్‌బాషాకు మద్యం తాగి వాహనం నడిపినందుకు రూ.10 వేలు, వాహనానికి రిజిస్ట్రేషన్ లేకపోవడంతో రూ.1,000 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.45
సన్నవి :	రూ.35
పండ్లు :	రూ.20

నిమ్మ మార్కెట్‌కు వర్షం దెబ్బ




వెలవెలబోతున్న నిమ్మ మార్కెట్ యార్డు

పొదలకూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డుకు కాయలు రావడం లేదు. జడివానలు పట్టుకోవడంతో రైతులు తోటల్లో అడుగు పెట్టలేకపోతున్నారు. ఫలితంగా కాయలున్నా కోయలేని పరిస్థితి ఏర్పడింది. గురువారం కాయలు రాక యార్డు వెలవెలబోయింది. సీజన్‌లో వేల బస్తాల కాయలు వివిధ గ్రామాల నుంచి వస్తుంటాయి. అన్ సీజన్‌లో తక్కువ సంఖ్యలో కాయలు వచ్చినా మార్కెట్‌లో హడావుడి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఆటోల్లో సైతం కాయలు తీసుకురాకపోవడంతో యార్డు కళ తప్పింది. శుక్రవారం సైతం చెప్పుకోదగిన స్థాయిలో కాయలు మార్కెట్‌కు రావని వ్యాపారులు వెల్లడించారు.

తగ్గకుండా..

ఈ ఏడాది రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా కాయల ధరలు అన్ సీజన్‌లో కూడా తగ్గకుండా అమ్ముడుపోతున్నాయి. వర్షాకాలంలోనే బస్తా (80 కిలోలు) రూ.3 వేలకు తగ్గకుండా పలుకుతోంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ మార్కెట్ దిగజారకుండా ఉండడంతో ఈ ధరలు లభిస్తున్నట్లు తెలుస్తోంది. తెనాలి, ఏలూరు తదితర మార్కెట్ల నుంచి కాయలు ఎగుమతి అవుతున్నా పొదలకూరు ప్రాంతం కాయలకు ఢిల్లీలో ధరలు లభిస్తున్నాయి. దీనికితోడు కార్తీక మాసం కావడంతో నిమ్మకాయలు వాడకం పెరిగి ధరలు నిలకడగా ఉన్నట్టు తెలిసింది. జనవరి నుంచి తోటల్లో కాయల దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. తర్వాత ఏప్రిల్, మే నెలల్లో రైతులు, వ్యాపారులు తీరిక లేకుండా కాయలు కోయడం, అమ్మకాలు సాగించడం జరుగుతుంది.

వీలుపడదు



జడివానల వల్ల రైతులు తోటల్లోకి వెళ్లలేక కాయలను కోయలేకపోతున్నారు. తోటల్లోకి వెళ్లాలంటే రొచ్చుగా ఉండడంతో కాయలను కోసి బయటకు తీసుకురావాలంటే వీలుపడదు. ఈ సీజన్‌లో సైతం నిమ్మకు మంచి ధరలు లభిస్తున్నాయి. దిగజారే పరిస్థితి కనిపించడం లేదు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు